నేడు ఉచిత వైద్య శిబిరం

రంగారెడ్డినగర్: గాంధీనగర్‌లోని ఫాతిమా హెల్త్ కేర్ సెంటర్ అండ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు డాక్టర్ ఇఫ్తికరుల్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు జలుబు, జ్వరం, హైపర్ టెన్షన్, డయాబెటీస్, థైరాయిడ్, కీళ్ల నొప్పులతో బాధ పడేవారికి వైద్య సేవలు అందించనున్నారు. ఇతర వివరాలకు 7989528219 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్



జయభేరి కాలనీలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆదివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా జయభేరి కాలనీలో రోడ్డుపై చేరిన నీరు పలు ఇళ్లల్లోకి వెళ్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో సెల్లార్‌లోకి వర్షపు నీరు వెళ్లినట్లు గుర్తించారు. రాబోయే రోజుల్లో వర్షం నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.

లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: ప్రగతి గనర్ లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి తొలి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రమేష్ అధ్యక్షత వహించారు. కాలనీ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. అసోసియేషన్ ఎన్నికల ద్వారా కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షులుగా గోవిందరాజులు, శాస్త్రీ, ప్రధాన కార్యదర్శిగా సంజయ్, కార్యదర్శులుగా డా.ప్రశాంత్, శ్రీకాంత్, కోశాధికారిగా సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా కల్యాణ్ ఎన్నియ్యారు. సమావేశంలో కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాల్సిన అంశాలు, భద్రతా ఏర్పాట్లు, దోమల నివారణ చర్యలు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, అంబీర్ చెరువు సుందరీకరణ తదితర అంశాలపై చర్చించారు. అసోసియేషన్ ఏర్పాటుకు సంఘీభావంగా పలు అపార్ట్‌మెంట్‌కు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల సమస్యలను పరిష్కరించండి



డా.వేణుకుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వర్సిటీల సమస్యలను పరిష్కరించాలని ఏఐఓబీసీ జేఏసీ ఛైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్ అన్నారు. ఆదివారం ఓయూలో జరిగిన పీహెచ్‌డీ పూర్తి చేసిన నిరుద్యోగుల సభలో ఆయన మాట్లాడారు. 13 ఏండ్లుగా ఉద్యోగాలను భర్తీ చేయనందున వర్సిటీలలో తీవ్రమైన అధ్యాపకుల కొరత ఉందని తక్షణం 3 వేల ఖాళీలను భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. వర్సిటీలకు బడ్జెట్ పెంచాలని, మౌలిక వసతులు పెంచాలని, ఉద్యోగాల భర్తీలో తక్కువ అధ్యాపకులు గల విభాగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ఓయూలో అధికంగా బీసీ విద్యార్థులే చదవుతున్నారని పీహెచ్‌డీ ప్రవేశాలలో తగిన న్యాయం చేయాలని అధికారులను కోరారు.

బీసీ విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. ఫీజుల పెంపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేమని చెప్పడం, పాలిటెక్నికల్ కోర్సుకు రూ.14, 500 ఫీజును 39 వేలకు పెంచారని, ఫీజులను బీసీ విద్యార్థులలే భరించాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం అత్యంత దారుణమన్నారు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లిస్తూ కేవలం బీసీలకు ఫీజులు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రవంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు బీసీల పక్షాన నిలబడి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని లింగంగౌడ్ కోరారు.

అమ్మకు బోనం.. భక్తుల సంబురం





చిత్తారమ్మ అమ్మవారికి కోళ్లను మొక్కుగా చెల్లిస్తున్న భక్తులు





హైదర్‌నగర్‌లోని అమ్మవారిని దర్శించుకున్న పీఏసీ చైర్మన్ గాంధీ



అంబేడ్కర్ నగర్‌లో బోనాల ఉత్సవంలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆషాఢమాసం చివరి ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. డప్పు దరువుల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. పలు ప్రాంతాల్లో శివసత్తుల పూనకాలతో, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పలు ప్రాంతాల్లోని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఫలహారం బండ్లు ఊరేగింపుగా చేరుకుని అమ్మవారికి సమర్పించారు.

– కూకట్‌పల్లి(జోన్‌బృందం)



మూసాపేటలోని చిత్తారమ్మను దర్శించుకున్న మాజీ కార్పొరేటర్లు, నాయకులు



వివేకానందనగర్‌లో బోనాల తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



మూసాపేట చిత్తారమ్మ అమ్మవారి పూజలో ఎమ్మెల్యే కృష్ణారావు



మంచినీరు అందజేస్తున్న వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్



కార్పొరేటర్ రోజాదేవి రంగారావును ఆశీర్వదించిన అర్చకులు



శ్రీరామారావు నగర్‌లో ..



మూసాపేటలో బోనాల సందర్భంగా గంపల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో మూసాపేట చిత్తారమ్మ తల్లి



మూసాపేటలో చిత్తారమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకున్న డా. సత్యం శ్రీరంగం



ప్రసాదం పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు



బోనాల వేడుకల్లో పాల్గొన్న అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి



శంషీగూడలో అమ్మవారి పూజలో ఎర్రబెల్లి సతీష్‌రావు

12,378 కార్డుల పంపిణీకి ఏర్పాట్లు!

- రేషన్ కార్డుల పంపిణీకి అధికారుల ప్రణాళికలు
- ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులు
- కొనసాగుతున్న ఇంటింటి సర్వే

బాలానగర్: ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న రేషన్‌కార్డులు పంపిణీకి పౌరసరఫరాల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రజా పాలన, మీ సేవా కేంద్రాల్లో, వార్డు కార్యాలయాల్లో అర్హులైన వారి నుంచి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. కార్డుల కోసం దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. బాలానగర్ కార్యాలయం పరిధిలో కుత్బుల్లాపూర్, బాలానగర్, కూకట్‌పల్లి మండలాలు ఉన్నాయి. 227 రేషన్ షాపులు ఉన్నాయి. రేషన్ కార్డుల కోసం 29,600 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 360 డిగ్రీల కోణంలో అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి 12,378 మంది అర్హులుగా తేల్చారు. ఇంకా సర్వే కొనసాగుతున్నది. పాత రేషన్ కార్డుల్లో కొత్తగా పేర్లు నమోదు కోసం 38,211 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా పేర్లు చేర్చటం, రేషన్ కార్డులలో పేరు తొలగించడం, నూతన కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించడం నిరంతర ప్రక్రియ అని అధికారులు తెలిపారు.

కార్డు కోసం ఎదురు చూస్తున్నాం

నా కొడుకులు ఇద్దరికి వివాహమైంది. కార్డులలో మా ఇద్దరి పిల్లల పేర్లు తొలగించాము. వారికి ప్రత్యేక కార్డు మంజూరు కోసం దరఖాస్తు చేశాం. ఏ సంక్షేమ పథకాలు కావాలన్నా రేషన్ కార్డు కావాల్సిందే. వారి పేరుమీద రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నా. ఇప్పటికే అప్రూవల్ అయ్యింది.

– శ్రీనివాస్, జగద్గిరిగుట్ట

సింహపురి కాలనీ చెరువు పరిశీలన



నిజాంపేట్: సింహపురి కాలనీ చెరువుని ఆకుల సతీష్ స్థానిక ప్రజలతో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుని అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్, మల్కాజిగిరి ఆర్డీఓ, ఇరిగేషన్ డీఈ దృష్టికి తీసుకెళ్లారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట గ్రామం సింహపురి కాలనీలో బలిజవానికుంట ఉందన్నారు. నాలాను పూడ్చి కొందరు కాంపౌండ్ వాల్ నిర్మించడం వల్ల నీళ్లు వెళ్లకపోవడంతో దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్వే నంబర్ 450లో ప్రభుత్వ భూమి 3.20 ఎకరాల్లో చెరువు విస్తీర్ణం పోను మిగతా ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయాలన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులను ఏర్పాటు చేసి, మిగిలిన ప్రభుత్వ స్థలంలో పార్క్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణ్‌రావు, చందు, అశోక్‌రెడ్డి, రామ్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, రవీంద్ర, శేషు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తతే కీలకం

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా కసరత్తు.
- పారిశుద్ధ్యంపై అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ
- వారానికోసారి డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన
- క్షేత్ర స్థాయి పర్యవేక్షణపై కలెక్టర్ నజర్





సాక్షి,మేడ్చల్ జిల్లా: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జిల్లా వైద్యారోగ్యశాఖ, పురపాలక సంఘాల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్య లు చేపట్టారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో డెంగీ కేసులు ఇబ్బడిముబ్బడిగా నమోదవుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది.

కలెక్టర్ సమీక్ష..

అంటువ్యాధులు, డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ.. అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలు, జ్యోతిరావుపూలే, రెసిడెన్షియల్ స్కూళ్లకు తనిఖీలు చేపట్టి పలు చర్యలకు ఉపక్రమించారు.

- దవాఖానాలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పురపాలక సంఘాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, వాటిని లక్ష్యానికి తగినట్లుగా చక్కబెట్టాలన్న యోచనతో కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. పురపాలక సంఘాల్లో 100 రోజుల కార్యాచరణ కొనసాగుతోంది. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా..

వర్షాకాలంలో ప్రధానంగా జలుబు, దగ్గు, జ్వరం వంటివి అధికంగా సోకుతాయి. రోగులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రులకు వస్తే మందులు అందుబాటులో ఉండేలా అధికార యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది.

పట్టణాలు, బస్తీలపై ప్రత్యేక దృష్టి

పట్టణాలు, బస్తీల ప్రజలకు వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఇలాంటి వాటిని గుర్తించిన వైద్యాధికారులు అక్కడి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

- అధిక వర్షాల కారణంగా గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వైద్యుల సూచనల మేరకు వారిని ముందస్తుగా ఆసుపత్రుల్లో చేరాలని సూచిస్తున్నారు.

పారిశుద్ధ్యంపై..

వర్షాకాలంలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. చిన్నపాటి వర్షాలకే కొన్ని పురపాలక సంఘాల్లోని పలు కాలనీలు, వీధులు చెరువులను తలపిస్తున్నాయి. మురుగు, వ్యర్థాలు ఇళ్లల్లోకి చేరడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వర్షాకాలం ముగిసేంత వరకు బస్తీలు, కాలనీలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణపై దృష్టి సారించాలని జిల్లా అధికార యంత్రాంగం సూచిస్తోంది.

వారంలో ఒకరోజు..

వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది అనేక రోగాలకు కారణమవుతాయి. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వారంలో ఓ రోజు(శుక్రవారం) డ్రైడే పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇంటింటికీ వార్డు అధికారి, ఆశాకార్యకర్త, అంగన్‌వాడీ టీచర్, పారిశుద్ధ్య సిబ్బంది వెళ్లి నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెందుతాయనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. వేడి పదార్థాలను తీసుకోవాలి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకూడదు. బయటి తినుబండరాలకు దూరంగా ఉండాలి.
- కాచీ చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం మంచిది. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటిసంపులు, నీటి పాత్రలపై నిరంతరం మూతలు ఉంచాలి. వారానికోసారి నీరు నిల్వ ఉన్న పాత్రలు, డ్రమ్ములను ఖాళీ చేసి శుభ్రపరచుకోవాలి.